కథ

# హసీనా

కె.వి.యస్.వర్మ

**"అబ్బబ్బ, చూడలేకపోతున్నా, ఆ సీరియల్ ఆపుచేద్దూ"**

**"అసలు ఈ హాల్లోకి నువ్వెందుకొచ్చావ్. నీ హోంవర్క్ చేసుకో గదిలోకెళ్లి"**

**"అమ్మా తల్లీ, నా హోం వర్కు పూర్తిచేసుకునే ఇక్కడికొచ్చా. డిస్కవరీ చానెలో, కార్టూన్ చానెలో చూసి కాస్సేపు రిలాక్స్ అవుదామని ఇక్కడికొచ్చా"**

**'సర్లే. ఇదయిపోనీ, తర్వాత పెట్టుకుందువుగాని"**

"అలాగే అంటావుగానీ, మరో సీరియల్ చూస్తావు. నీ సీరియల్ పిచ్చితో చస్తున్నానే మహాతల్లీ" అంది హసీనా కోపాన్ని ఆపుకుంటూ.

"ఏంటే, ఆరిందాలా మాట్లాడుతున్నావ్. నీ కసలు భయం భక్తీ లేకుండా పోయాయి" అంది రషీదా చిరాగ్గా.

ఇంతలో పక్క గదిలోంచి ఏడుపు వినిపించింది.

"చెల్లి ఏడుస్తోందే. ఆకలేస్తుందేమో వెళ్లి చూడు"

"మా హసీనా మంచి పిల్ల. కాస్త నువ్వెళ్లి చూడవే. ఈ సీరియల్ మంచి సస్పెన్స్‌లో ఉంది"

"అమ్మో, ఎంత గొప్ప తల్లివే అమ్మా" అంటూ హసీనా హాల్లోంచి పక్క గదిలోకెళ్లింది.

రెండేళ్ల చెల్లెల్ని ఎత్తుకుంది.

"ఏంటే బుజ్జీ ఏడుస్తున్నావ్. ఆకలేస్తోందా?" భుజాన చెల్లెలి తలపెట్టి జోకొడుతూ ఆగదిలో అటూ ఇటూ తిరుగుతూ అంది.

జాస్మిన్ ఓ క్షణం ఏడుపు ఆపి, మళ్లీ కేర్ కేర్ మంది.

హసీనా హాల్లోకొచ్చి "మమ్మీ, ఆకలేస్తుందనుకుంటా, ఏడుపు ఆపడం లేదు. జాస్మిన్‌కు పాలివ్వు" అంది.

"ఉస్, కాసేపు సీరియల్ చూద్దామనుకున్నా కుదరడం లేదు"

"ఏంటీ, కూతురికి పాలు ఇవ్వడానికి కూడా తీరిక లేదా తల్లీ"

"ఏంటే, అస్తమానం తల్లీ అంటూ ఆ వెటకారం"

"కోపం వచ్చినప్పుడు మమ్మీతో ఏ కూతురైనా అలా అనకుండా ఇంకెలా అంటుందే తల్లీ. ముందు నీ ముద్దుల కూతుర్ని ఎత్తుకుని పాలివ్వు"


"ఏవే హసీనా, నేను పెద్దా, నువ్వు పెద్దా"

"మా అందరికీ మమ్మీవి. నువ్వుగాక నీ కూతుర్ని నేనెలా పెద్దవుతానే. అయినా నేను కూడా పెద్దదాన్నే" అంది 'పెద్ద' మాటను నొక్కి పలుకుతూ హసీనా కన్ను గీటి చిన్నగా నవ్వుతూ.

"నువ్వు మరీ రౌడీ రాణివై పోతున్నావే" అంటూ టీవీ సీరియల్ చూస్తునే రషీదా "ఇక తప్పదు" అనుకుంటూ జాస్మిన్‌ను ఎత్తుకుంది.

జాకెట్టు బొత్తాలు విప్పి కూతురికి పాలిస్తూ టీవీ వైపే దృష్టి పెట్టింది.

జాస్మిన్ తల్లిపాలు తాగుతూ ఏడుపు ఆపింది. చెల్లినీ తల్లినీ చూస్తూ హసీనా "అమ్మయ్య" అనుకుంది.



"అక్కా, ఈ లెక్క నాకు అర్థం కావడం లేదు. కాస్త చెప్పక్కా, నీకు పుణ్యముంటుంది"

హసీనా తన తమ్ముడి పుస్తకం ఓసారి చూసి, అలా కాదు, ఇలా చేయాలని చెప్పింది.

"థాంక్స్ అక్కా" అంటూ ఆ పిల్లాడు హాల్లోంచి పక్క గదిలోకి వెళ్లి పోయాడు.

"మమ్మీ, డాడీ ఇంకా రాలేదేంటి?"

'ఈ మధ్య ఖర్చులు పెరిగాయి కదా. దాంతో ఆఫీసు పనయ్యాక మరోచోట పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నారు. అంచేత ఎప్పుడొస్తారో చెప్పలేం. వచ్చేటప్పటికి బాగా రాత్రయిపోవచ్చు' అంది రషీదా జాకెట్టు బొత్తాలు పెట్టుకుంటూ.

"మాం. ఆకలే అన్నం పెట్టు" అంటూ రషీదా రెండో కూతురు వచ్చింది.

"ఒక్క నిమిషం ఆగవే యాస్మిన్. ఈ సీరియల్ అవగానే అన్నం పెడతాను" అంది రషీదా.

"నీ సీరియల్స్ తగలెయ్య. ఇవి ఆకలి మంటలు బాబూ, ఇవి ఆరని మంటలు బాబూ" అంది హసీనా నవ్వుతూ.

"నీ ముదురు కబుర్లతో నన్ను చంపకే తల్లీ "

"చద్దన్నం తిన్నమ్మ మొగుడాకలి ఎరగదు అని ఓ సామెత ఉంది. దాన్ని సీరియల్ మరిగిన అమ్మ పిల్లల ఆకలి ఎరగదు అని మార్చుకుంటే బావుంటుంది."

"నోటికేదొస్తే అది వాగేసెయ్యడమే. నిన్ను మరీ గారం చేస్తున్న మీ డాడీని అనాలి. ఆయన తెచ్చే తెలుగు పుస్తకాలు తెగ చదువుతూ మన భాష మర్చిపోయేలాగున్నావ్. సరేగానీ, కంచాలు కడిగిపెట్టు. గ్లాసులతో మంచినీళ్లు కూడా తీసుకురా". అని రషీదా టీవీ వైపుకి ముఖం తిప్పింది.

"పనులు పురమాయించడంలో నీ తర్వాతే ఎవరైనా. ఇక తెలుగు పుస్తకాలంటావా. నాన్న కంటే బాగా చదవడమే కాదు, స్మైల్‌లా కథలు రాస్తా. కాస్త పెద్దయ్యాక ఇస్మాయిల్‌లా కవితలూ గౌస్‌లా నవలలు కూడా రాసినా రాసేస్తా జాగ్రత్త" అంటూ నవ్వునాపుకుని వంట గదిలోకెళ్లింది హసీనా.

"ఏంటిదీ మనోళ్ల పేర్లు అన్ని చెప్పేసింది? స్మైల్ పేరుతో రాసే ఇస్మాయిల్ అంటే మా ఏలూరాయన. మిగతా వాళ్లెవరబ్బా? వాళ్ల పుస్తకాలు చదివిందో చూసిందో. అయినా అవన్నీ మనకెందుకు" అనుకుంటూ టీవీ సీరియల్‌లో నిమగ్నమయిపోయింది రషీదా.

"అన్నీ రెడీ. అన్నం, కూరలు నన్నే పెట్టమంటావా? నువ్వొచ్చి పెడతావా" అంది హాల్లోకొచ్చి హసీనా.

"సీరియల్ అయిపోయింది. నేనే పెడతాలే" అంటూ రషీదా లేచింది.

నిద్రపోతున్న చివరి పిల్ల జాస్మిన్‌ను అలాగే వదిలేసి, అబ్బాయినీ రెండో అమ్మాయినీ లేపి, వంట గదిలోకి తీసు కెళ్లింది రషీదా.

పిల్లలకు అన్నం తినిపించి తర్వాత రషీదా హసీనా తిన్నారు.


"మమ్మీ, డాడీ ఎప్పుడొస్తారో" అంది చేయికడుక్కుని హాల్లోకొస్తూ హసీనా.

"చెప్పలేమే. ఏ రోజు పని ఆ రోజే చేయడం ఆయన అలవాటు కదా. ఎంత రాత్రవుతుందో తెలీదు" అంటూ రషీదా తమిళ చానెల్ పెట్టింది.

"మాతాశ్రీ, తెలుగు, హిందీ సీరియల్స్ సరిపోలేదా. తమిళ చానెల్ పెట్టావు"

"కొన్ని సీరియల్స్ తమిళ డబ్బింగ్ కదా. తమిళ సీరియల్స్ చూస్తే ముందేమి జరగబోతుందో ఇవాళే తెలిసిపోతుంది"

"ఆ 'అల్లా'యే నిన్ను కాపాడాలమ్మా" అంది హసీనా విసుగ్గా మొహం పెట్టి.



రషీదా కూతురి మాటలు విననట్టు టీవీ చూస్తూ కూర్చుంది.

హసీనా ఏదో పుస్తకం తీసింది చదువుదామని.

"పొద్దుటే స్కూలుకెళ్లాలిగా, పడుకో"

"డాడీ వచ్చాకగానీ పడుకోను"

"ఆయనెప్పుడొస్తారో చెప్పలేం అన్నానుగా. పడుకో, చెల్లెళ్ల పక్కన"

"నా ప్రోగ్రెసివ్ రిపోర్టు చూపించాలి"

"నాకు చూపించావుగా నేను డాడీకి చూపిస్తాలే"

"అమ్మా, నిన్నూ, నీ మాటలూ చూసేక ఇప్పటి కుర్రాళ్లు కనీసం ఇంటరో, డిగ్రీయో చదివిన అమ్మాయిల్ని పెళ్లి చేసుకోడానికి ఎందుకిష్టపడుతున్నారో తెలుస్తోంది. చెప్పమంటావా"

"నీ ఆరిందా కబుర్లినలేక చస్తున్నానే హసీనా. సరే. ఎందుకో చెప్పు"

"చదువుకున్న తల్లులైతే పిల్లల చదువుల్ని బాగా పట్టించుకుంటారని మా స్కూల్ మేడమ్ చెప్పింది. నా ప్రోగ్రెస్ రిపోర్టులో ఏ సబ్జెక్టుకు ఎన్ని మార్కులొచ్చాయో నీకు తెలుసు. అయితే, ఏ సబ్జెక్టులో ఎన్ని మార్కులొస్తే గొప్పో నీకు తెలియదు. అయినా, నీకు చెప్పే ప్రయత్నం చాలాసార్లు చేశాను. నువ్వు ఆసక్తి చూపలేదు. అందుకే నాన్నగారి కోసం ఎదురు చూస్తున్నాను"

"అమ్మా, నేనిలాగంటున్నానని తప్పు పట్టొద్దు. నువ్వు అయిదో తరగతి మించి చదవక పోవడం వల్ల నువ్విలా మాట్లాడుతున్నావ్. మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడు మమ్మీయో డాడీయో మెచ్చుకోవడం ఎంత ఆనందాన్నిస్తుందో నీకు తెలియదు. అది నీ తప్పుకాదు. అదే డాడీకయితే ఏ సబ్జెక్టులో ఎక్కువ మార్కు లొస్తే మంచిదో తెలుస్తుంది" హసీనా ఎంతో సౌమ్యంగా చెప్పింది.

"రేపొద్దుట చూపించొచ్చు కదా"

"అమ్మా, నేనిలాగంటున్నానని తప్పు పట్టొద్దు. నువ్వు అయిదో తరగతి మించి చదవక పోవడం వల్ల నువ్విలా మాట్లాడుతున్నావ్. మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడు మమ్మీయో డాడీయో మెచ్చుకోవడం ఎంత ఆనందాన్నిస్తుందో నీకు తెలియదు. అది నీ తప్పుకాదు. అదే డాడీకయితే ఏ సబ్జెక్టులో ఎక్కువ మార్కులొస్తే మంచిదో తెలుస్తుంది" హసీనా ఎంతో సౌమ్యంగా చెప్పింది.

రషీదా కూతురు చెప్పింది విందిగానీ, ఆలోచించలేదు. భాష అర్థం కాకపోయినా తమిళ చానెల్‌లో లీనమయిపోయింది.

** ** **

"మాతృశ్రీకి నమోవాకాలు" అంటూ ముందుకు వంగి రెండు చేతులూ జోడించింది హసీనా.

"ఏంటే సంగతి. చాలా వేషాలు వేస్తున్నావ్"

"మంచి వాళ్లకు నమస్కారాలు చేయకపోయినా ఫర్వాలేదట. పట్టించుకోరట. అదే పెద్దవాళ్లకు నమస్కారాలు చేయకపోతే పట్టించుకోవడమే కాదు, చెడు చేయడానికి వెనుకాడరట..."

"అంటే... అంటే నేను పెద్దదాన్నా" అంది రషీదా కాస్త తెల్లబోయి కోపంగా.

"ఏమో, ముందు ముందు ఎవరు ఎలా మారతారో ఎవరు చెప్పగలరు? అల్లాకు మాత్రమే తెలుసు" అంటూ పైకి చూసింది హసీనా.

"ఈ మధ్యన నీ మాటలకు అంతూపొంతూ ఉండడం లేదు. ఇంతకీ విషయమేమిటో చెప్పు. అవతల నాకు వంట పనుంది" అంది రషీదా చిరాగ్గా.

"స్కూలు నుంచి వస్తోంటే మన పక్కవీధి అంకుల్ ఇంటిదగ్గర జనం గుమిగూడి ఉన్నారు. ఆంటీ నస్రత్ ఏడుస్తోంది. సంగతేమిటో తెలుసుకుందామని కాసేపు అక్కడున్నాను. ఆ మధ్య, నా ఈడుదో నాకంటే కాస్త పెద్దదో అయిన షైనాజ్‌కు మన హైదరాబాద్ వచ్చిన ముసలి అరబ్‌షేక్‌కు ఇచ్చి పెళ్లి చేశారు కదా. ఆ ముసలి నక్క అబిడ్స్‌లో ఏదో పెద్ద హోటల్‌లో షైనాజ్‌తో శోభనం చేసుకుని తన దేశం తీసుకెళ్లిపోతున్నానని మహ్మద్ అంకుల్‌కు చెప్పాడట. తీరా చేస్తే ముంబయికి తీసుకెళ్లి అక్కడో హోటల్‌లో బసచేసి, నాలుగు రోజులు తన సరదా తీర్చుకుని ఆ నూనె జిడ్డు షేక్‌గాడు ఆమెను వ్యభిచార కొంపకు అమ్మేశాడట. ఎలా తెలిసిందో ఏమో పోలీసులు షైనాజ్‌ను ఇప్పుడే ఇక్కడికి తెచ్చి అప్పగించారట..."

"అయ్యో అయ్యయ్యో ,ఎంత పని జరిగిందే. నేనెళ్లి పరామర్శించి రావాలి..."

"గాడిద గుడ్డు కాదూ, పరామర్శించి ఏం చేస్తావ్. ఆమెకు జరగాల్సిన అన్యాయం జరిగే పోయింది. ఇదేమీ మన హైదరాబాద్‌లో కొత్తేమీ కాదట కదా. చాలామంది అమ్మాయిల్ని అరబ్‌షేక్‌లకు అమ్ముతూనే ఉంటారట కదా, పెళ్లి పేరుతో..."

"అవునే. మూడు నాలుగేళ్ల క్రితం షకీలా అని మన బంధువులమ్మాయిని ఓ అరబ్‌షేక్‌కిచ్చి పెళ్లి చేశారు. తీరా ఆ దేశానికెళ్లాక పనిమనిషిని చేశార్ట. అంతేకాదు, ఆ అరబ్‌షేక్‌తో పాటు వాడి తమ్ముళ్లు-కూడా ఆమెను అనుభవించేవారట. షకీలా అన్నీ పూసగుచ్చినట్టు లెటరు కూడా రాసింది..."

"నీకు నమస్కారం అందుకే పెట్టాను. మీ ముగ్గురి ఆడపిల్లల్లోనూ నేనే పెద్దదాన్ని కదా. నాకు వచ్చే ఏప్రిల్ నాటికి పధ్నాలుగేళ్లు నిండుతాయి కూడానూ. డబ్బుకాశపడి నన్నూ ఓ ముసలి అరబ్‌షేక్‌కు అమ్మేస్తారేమో...."

"ఛఛ... అవేం మాటలే తల్లీ" రషీదా కూతురి నోటికి చెయ్యి అడ్డం పెట్టింది.

"నేను బాగా చదివి ఉద్యోగం చేస్తాను. నాన్నకు సాయపడతాను..."

"నా తల్లే. నువ్వు ఎంత చదివినా చదివిస్తాం. నీ ఇష్ట

తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించి 20 నం॥లలో తెల్లమచ్చలు ఎరుపురంగుగా మారి, వెంటనే నూటికి నూరు శాతం గ్యారంటీగా మచ్చలు సహజ చర్మము రంగుగా మారును. మా మందులు ఒకసారి వాడిచూడండి. మీ వయస్సు, వ్యాధి వివరములను వ్రాయండి. 15 రోజుల మందులను ఉచితంగా ఇవ్వబడును. మీరు ఉత్తరం ద్వారా గాని ఫోన్ ద్వారా పంపండి.

BALAJI AYURVED (2)
P.O. Katri Sarai (gaya)
Ph: 06112 289319, 09431025455

ప్రకారమే పెళ్లి చేస్తాం" అంటూ రషీదా కూతురి తలపై ముద్దు పెట్టుకుంది.

"హమ్మయ్య" అనుకుంటూ హసీనా తల్లిని ముద్దు పెట్టుకుంది.

ఆ వెంటనే ఆలోచనలో పడింది.

"నాన్న డబ్బు సంపాదించడానికి చాలా కష్టపడుతున్నాడు. తమకు న్యాయం చేయడానికి అదొక్కటే సరిపోతుందా?" హసీనా చిన్న బుర్ర పెద్ద ఆలోచనలు చేయడం మొదలు పెట్టింది.

** ** **

"ఏంటే అమ్మా, అప్పుడే వంటపనిలో పడ్డావ్" అంది హసీనా.

"నాన్నగారు ఇవేళ తొమ్మిది గంటలకల్లా వచ్చేస్తానన్నారు. అందుకని..."

"అలాగా. ఏదో స్పెషాల్టీ ఉండుండాలే"

రషీదా ఠక్కున కూతురి వంక చూసింది. హసీనా అతి మామూలుగా ఉండే ప్రయత్నం చేసింది.

రషీదా చికెన్ కర్రీ మాడిపోతుందోమోనని ఆదుర్దాగా వంట గదిలోకి పరుగెట్టింది.

హసీనా చిన్నగా నవ్వుకుంది.

జాస్మిన్ కెవ్వుమంది.

"ఏడవకు నా తల్లి ఏడవకే, ఏడిస్తే నీ కళ్ల నీలాలు కారు...." అని పాడుతూ చిట్టి చెల్లెల్ని సముదాయించింది హసీనా.

టీవీలో డిస్కవరీ చానెల్ పెట్టుకుని చూస్తూ చెల్లెల్ని ఆడిస్తోంది.

తొమ్మిది పావుకల్లా మహ్మద్ వచ్చాడు.

"వసే. నాన్న వచ్చినట్టున్నాడు. వెళ్లి తలుపు తియ్యి" అంది తొమ్మిదేళ్ల చెల్లెలివైపు చూస్తూ.

ఆమె తలుపు తీసింది. అహ్మద్ లోపలికొచ్చీ రాగానే జాస్మిన్‌ను ఒళ్లో పెట్టుకుని ఆడిస్తూ టీవీ చూస్తున్న హసీనాను ముద్దుపెట్టుకుని "అమ్మ అంతా చెప్పింది. పిచ్చి పిల్లా, నన్నూ కొందరి తండ్రుల్లా జమకట్టడం బావుందా" అన్నాడు.

తండ్రి కళ్లల్లో తిరిగిన నీళ్లు చూసి, "అలాంటిదేమీ లేదు నాన్నా. మాట వరసకన్నా"అంది హసీనా.

"అలాగయితే ఒకే. స్నానం చేసి వస్తా" అంటూ మహ్మద్ బాత్‌రూమ్ వైపు వెళ్లాడు లుంగీ పట్టుకుని.

ఓ పావు గంట తర్వాత అందరూ కలిసి భోజనం చేశారు.

తిన్న కంచాలన్నీ కడిగేసి, "హసీనా, జాస్మిన్ ఏడిస్తే నన్ను లేపేం" అంటూ పడగ్గదిలోకెళ్లిపోయింది రషీదా.

ఆ వెంటనే తండ్రీ వెళ్లాడు.

"ఒక్క నిమిషం" అంటూ హసీనా పడగ్గదిలోకెళ్లి,

"విష్‌యూ హ్యాపీ మారేజ్ డే. ఈ గిఫ్ట్‌ను తేవడానికి ఎంత కష్టపడ్డానో. ఎదురింటి జానకి ఆంటీకి విషయం చెప్పి సంపాదించాను" అంటూ గిఫ్ట్ ప్యాక్ చేసిన ఓ పేకెట్టు తల్లి చేతిలో పెట్టి, హడావిడిగా బయటకొచ్చి, ఆ గదికి గొళ్లెం పెట్టింది.

"ఏంటిదీ" అంటూ రషీదా పేకెట్ విప్పింది.

కండోమ్స్ పేకెట్!

రషీదా సిగ్గుపడిపోయింది. మహ్మద్ ముఖం మొదట మాడిపోయింది. కాసేపు కళ్లు మూసుకుని ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"హసీనా చిట్టి తల్లే కాదు, మా బంగారు తల్లి కూడా" అన్నాడు మహ్మద్ అభిమానం నిండిన స్వరంతో. ●

# శరీరం ఓ యుద్ధ భూమి

పోరాటం అనివార్యమే
కానీ ఉమ్మడి పోరాటానికి
తావు లేదిక్కడ
నీ దేహం ఓ యుద్ధ భూమి
అవయవాల చేతుల్లో ఆయుధాలు
ఎవరి దేహంతో వారు
పోరాడాల్సిందే
తప్పదు,
ఓటమి ఎవరిదైనా
తుదికంతా పోరాడటమే జీవితం
దేహం దేవాలయం కాదిప్పుడు
దయ్యాల కొంప
కోటానుకోట్ల బ్యాక్టీరియాలు,
వైరస్‌లూ, ప్రోటోజోవాలు
గబ్బిలాల్లా దేహ కణాల
చూర్లు పట్టుకుని
వేలాడుతూ...
నీ రణక్షేత్రంలోకి
నా ప్రవేశం నిషిద్ధం
మనసు గీతోపదేశం విని
కురుక్షేత్రంలో అర్జునుడిలా నువ్వు
రక్తం వేగంగా ప్రవహిస్తూ
టక్కున ఎక్కడో ఆగిపోతుంది.
గుండె రహదారుల మీద
ట్రాఫిక్ జాంలు
కిడ్నీనో, కాలేయమో
నీకు శత్రు సమూహాలై
బారులు తీర్తాయి.
నీ దేహం బాంబుల
కర్మాగారమౌతుంది.
నీకు తెలియకుండానే
ఏ అవయవమో
మందుపాతరలా
పేల్తుంది.
క్షణక్షణం
బతుకు భయం
పోరాటం వదిలేశావా
ప్రాణాలిక దక్కవు.

- సలీం